సాక్షి నంద్యాల
శనివారం। 28। సెప్టెంబర్। 2024



భ్రామరీకి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఉంచి విశేష పూజలు నిర్వహించారు.



భైరవా కరవకు!

జిల్లాలో ఏటా 5 వేల మందికి పైగా కుక్కకాటుకు గురవుతున్నారు. కుక్కకాటును నిర్లక్ష్యంగా వదిలేస్తే ప్రాణాపాయంగా మారే అవకాశం ఉంది. వ్యాక్సిన్‌ను తప్పక వేయించుకోవాలి. 8లో



పచ్చర్లలో హైకోర్టు జడ్జి బస

శిరివెళ్ల: పచ్చర్ల ఎకో టూరిజంలో హైకోర్టు జడ్జి మన్మథరావు శుక్రవారం బస చేశారు. విజయవాడ నుంచి కర్నూలుకు వస్తూ అక్కడ సేద తీరారు. అధికారులు స్వాగతం పలికారు.

న్యూస్‌రీల్

ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అహోబిలం



అవార్డు అందుకుంటున్న శివకుమార్ రెడ్డి

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలం ఆలయానికి గొప్ప విశిష్టత లభించింది. జాతీయ ఉత్తమ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా ఈ క్షేత్రం గుర్తించబడింది. శుక్రవారం పర్యాటక దినోత్సవం సందర్భంగా డిల్లీ విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో భారత ఉపరాష్ట్రపతి జగదీప్‌ధన్కర్, కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ చేదుల మీదుగా అవార్డును ఏపీ పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రతినిధి, ఇంటాచ్ నంద్యాల చాప్టర్ కన్వీనర్ శివకుమార్‌రెడ్డి అందుకున్నారు.

పర్యాటక రంగం అభివృద్ధికి ప్రణాళికలు

- జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్



పర్యాటక శాఖ పోస్టర్లను విడుదల చేస్తున్న జేసీ విష్ణుచరణ్, టూరిజం అధికారులు

నంద్యాల(అర్బన్): జిల్లాలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ టూరిజం అధికారులను సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాయింట్ కలెక్టర్ హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం, ప్రఖ్యాతిగాంచిన గుహ సంపదలు ఉన్నాయన్నారు. పర్యాటక రంగం ద్వారానే ప్రపంచంలోని అన్ని దేశాలు ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో దేశ వృద్ధిరేటు పెరుగుతోందన్నారు. పర్యాటక రంగ అభివృద్ధి అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ప్రముఖ పర్యాటక ప్రదేశాలను ఏడు టూరిజం సర్క్యూట్లుగా విభజించి అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. అనంతరం స్వదేశీ దర్శన్ 2.0 చాలెంజ్ డెస్టినేషన్ జేసీ ఆవిష్కరించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీల విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

చేనేత అభివృద్ధికి కృషి

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో చేనేత పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు, చేనేత ఉత్పాదకతను పెంచేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని జిల్లా చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు జి.నాగరాజరావు అన్నారు. శుక్రవారం చేనేత, జౌళిశాఖ ఏడీగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల జిల్లా చీరాల పట్టణానికి చెందిన ఈయన వైఎస్ఆర్ జిల్లా ఏడీగా పని చేస్తూ ఇటీవల బదిలీపై ఇక్కడికి వచ్చారు. నూతన ఏడీగా బాధ్యతలు స్వీకరించిన నాగరాజరావును కార్యాలయం సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో చేనేత సహకార సంఘాల అభివృద్ధికి చొరవ తీసుకుంటామన్నారు. ఆన్‌లైన్‌లో చేనేత వస్త్రాల మార్కెటింగ్‌కు ప్రత్యేకంగా కృషి చేస్తామన్నారు.

ప్రార్థిద్దాం.. కల్తీని తిప్పికొడదాం!

ఆలయాల్లో నేడు వైఎస్సార్‌సీపీ శ్రేణుల పూజలు

- ఉమ్మడి జిల్లాలో పల్లెల నుంచి పట్టణాల దాకా నిర్వహణ
- లడ్డూ పవిత్రతను దెబ్బతీసే వ్యాఖ్యల పాపం రాష్ట్రానికి తగలకూడదని సంకల్పం
- ప్రత్యేకంగా వెంకటేశ్వరస్వామి ఆలయాలకు శ్రేణులు
- తిరుమలకు వెళ్లొద్దని ఇప్పటికే వైఎస్సార్‌సీపీ శ్రేణులకు నోటీసులు
- ఎక్కడికక్కడ నేతలను కట్టడి చేస్తున్న పోలీసులు

సాక్షి ప్రతినిధి కర్నూలు: ఏడుకొండల వెంకటేశ్వర స్వామిని ప్రభుత్వం క్షుద్ర రాజకీయాలకు వాడుకోవడంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంఘటితం అయ్యాయి. ప్రభుత్వం చేసిన పాపపు వ్యాఖ్యలు రాష్ట్రానికి తగలకూడదని వైఎస్సార్‌సీపీ శ్రేణులు నేడు ఆలయాల్లో పూజలు చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో పూజలు చేయాలని ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. దీంతో కర్నూలు, నంద్యాల జిల్లాలోని 14 నియోజకవర్గాల పరిధిలో అన్ని మండల, గ్రామాల్లో నేడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆలయాల్లో పూజలు చేయనున్నారు. వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు చేయాలని రెండు జిల్లాల వైఎస్సార్‌సీపీ నేతలు భావించారు. పార్టీ శ్రేణులు భారీగా ఆలయాలకు తరలివెళ్లి తిరుమల లడ్డూ వ్యవహారంలో జరగని అపచారాన్ని జరిగినట్లు ప్రచారం చేస్తున్న తీరు, తద్వారా స్వామికి ఏదైనా కోపం ఉంటే అది అపచారం జరిగినట్లు ప్రచారం చేస్తున్న వారిపైనే ఉండాలనేలా స్వామిని ప్రార్థించనున్నారు.

తిరుమలకు వెళితే చర్యలు తప్పవని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు నోటీసులు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం తిరుమల పర్యటనకు వెళ్లాలని మొదట నిర్ణయించుకున్నారు. నేడు కాలినడకన తిరుమల చేరుకుని స్వామిని దర్శించుకోవాలని భావించారు. ఈ పర్యటన నేపథ్యంలో కర్నూలు, నంద్యాల జిల్లాలలోని వైఎస్సార్‌సీపీ ముఖ్యనాయకులు, పలువురు ఇన్‌చార్జ్‌లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, మండలాధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు పోలీసులు నోటీసులు పంపారు. 'తిరుమల పర్యటనకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అనుమతి లేదని, ఈ యాత్రలో పాల్గొనబోతున్నారని తమకు సమాచారం వచ్చిందని, అక్కడికి వెళ్లినా, అవాంఛనీయ ఘటనలు జరిగినా, చట్టపరంగా చర్యలు తీసుకుంటాం' అని పోలీసులు నోటీసుల్లో పేర్కొన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డితో పాటు కార్పొరేటర్లు కృష్ణకాంత్, వాసు, విక్రమసింహారెడ్డి, షాషావలి, జుబేర్ అహ్మద్‌తో పాటు దాదాపు అందరికీ పోలీసులు నోటీసులు పంపారు. గురువారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత ఈ నోటీసులు అందజేశారు. ఈ నోటీసులు తీసుకున్న వారంతా అవాక్కయ్యారు. అసలు తిరుమల పర్యటనకు తాము వెళ్లడం ఏంటి? వెళితే తమపై చర్యలు తీసుకుంటామని పేర్కొనడం ఏంటి? అని విస్తుపోయారు.



ఎస్వీ మోహన్‌రెడ్డికి పోలీసులు అందించిన నోటీసు

వాస్తవం ఇదీ

- జూన్ 4న రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు
- జూన్ 12న తిరుమలకు కొత్త కాంట్రాక్టర్ నెయ్యి సరఫరా ప్రారంభం
- జూన్ 12 నుంచి 17 వరకు 5 ట్యాంకర్లు సరఫరా, ఆపై ల్యాబ్ రిపోర్టు సరిగా లేదని రెండు ట్యాంకర్లు వెనక్కి
- కల్తీ జరిగినట్లు టీటీడీ చెబుతున్న నెయ్యి వెనక్కి పంపడంతో లడ్డూలో వాడలేదు
- కొత్త కాంట్రాక్టర్ సరఫరా చేసిన తొలి నెయ్యి ట్యాంకర్, లడ్డూలో వాడిన ఆరు ట్యాంకర్లు, తిరస్కరించిన రెండు ట్యాంకర్లు టీడీపీ ప్రభుత్వం హయాంలోనివే. పాత ప్రభుత్వానికి సంబంధమే లేదు.



ప్రభుత్వం చేస్తున్న ప్రచారం ఇదీ

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నెయ్యి కల్తీ జరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అబద్ధం.
- ప్రస్తుత టీడీపీ ప్రభుత్వ హయాంలో రెండు ట్యాంకర్ల నెయ్యి లడ్డూ తయారీలో వాడలేదని టీటీడీ ఈవో చెప్పినా, చంద్రబాబు మాత్రం లడ్డూలో కల్తీ నెయ్యి వాడారని, భక్తులు తిన్నారనే చర్చ.
- టీడీపీ హయాంలో జరిగిన మొత్తం తంతును వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగినట్లుగా తప్పుడు ప్రచారం.

నా రాజకీయ చరిత్రలో ఇంత దారుణం చూడలేదు




ఎన్టీ రామారావు నుంచి జగన్‌మోహన్‌రెడ్డి వరకూ చాలా ముఖ్యమంత్రులను చూశా. రాజకీయం కోసం వెంకటేశ్వరస్వామి ప్రతిష్టను దిగజార్చేలా మాట్లాడిన సీఎంను తొలిసారి చూస్తున్నా. ఇది మంచిది కాదు. మొదటిది లడ్డూలో కల్తీనే జరగలేదు. ఇది సాక్షాత్తూ టీటీడీ ఈవోనే చెప్పారు. ఒకవేళ జరిగి ఉంటే కొత్త టెండర్ దక్కించుకున్న కంపెనీ నెయ్యి సరఫరా చేయడం ప్రారంభమైందే జూన్ 12 నుంచి, 6 ట్యాంకర్లు వాడారు. బాగాలేదని 2 ట్యాంకర్లు వెనక్కి పంపారు. ఒకవేళ ఏదైనా పొరపాటు జరిగిందంటే మొత్తం టీడీపీ హయాంలోనే జరిగింది. కానీ వైఎస్సార్‌సీపీపై టీడీపీ బురదచల్లాలని చూస్తోంది. వాస్తవాలు ఏంటో స్వామికే తెలుసు. వైఎస్సార్, జగన్ ఎన్నోసార్లు తిరుమల వెళ్లారు. వారు స్వామిని దర్శించుకునేందుకు అనుమతా? అసలు ప్రజాస్వామ్య దేశంలో మనం ఉన్నామా? ఎవరు తప్పు చేసినా స్వామి క్షమించరు. పార్టీ శ్రేణులంతా నేడు ఆలయాల్లో పూజలు చేయాలి.

– కాటసాని రాంభూపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, నంద్యాల జిల్లా



చంద్రబాబు అడ్డంగా దొరికిపోయారు



లడ్డూ వ్యవహారంలో చంద్రబాబు అడ్డంగా దొరికిపోయారు. జగన్ తిరుమలకు వస్తే వాస్తవాలు బట్టబయలవుతాయని భయపడ్డారు. అందుకే ఆయనపై దాడి చేయాలని కుట్రపన్నారు. తిరుమల గొప్పతనాన్ని, దేవుడిపై ఆయనకున్న నమ్మకంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకూడదని జగన్‌మోహన్‌రెడ్డి తిరుమల పర్యటనను విరమించుకున్నారు. రాజకీయాల కంటే శాంతిభద్రతలు, విలువలు ముఖ్యమని భావించారు. చంద్రబాబు పాపాలను ప్రక్షాళన చేసేందుకు వెంకటరమణ కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా అందరూ ఆయా ఆలయాల్లో పూజలు చేయాలి.

– ఎస్వీ మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, కర్నూలు జిల్లా

గొల్లలేరు డ్రైన్‌ను పూర్వస్థితికి తెస్తాం

- ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్థన్



గొల్లలేరు డ్రైన్ ఆక్రమణలను పరిశీలిస్తున్న మంత్రి బీసీ, కలెక్టర్ రాజకుమారి తదితరులు

అవుకు: అవుకు రిజర్వాయర్ పరిధిలోని గొల్లలేరు డ్రైన్ ఆక్రమణలను తొలగించి పూర్వస్థితికి తీసుకు వస్తామని ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. శుక్రవారం అవుకు – తాడిపత్రి ప్రధాన రహదారిలో గొల్లలేరు డ్రైన్ ఆక్రమణలకు గురైన ప్రదేశాన్ని డ్యాం సేఫ్టీ చీఫ్ ఇంజినీర్ రత్నకుమార్, జిల్లా కలెక్టర్ రాజకుమారితో కలసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొల్లలేరు డ్రైన్, ఇరువైపులా ఏర్పాటు చేసి మట్టికట్టలు కనిపించకుండా ఆక్రమించడంతో ముంపు ప్రమాదం ఉందన్నారు. ఇటీవల విజయవాడ వరద నీటిలో చిక్కుకునేందుకు బుడమేరు ఆక్రమణలే కారణమని గుర్తు చేశారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌కు గొల్లలేరు డ్రైన్ పూర్వ స్థితికి తీసుకు వస్తానన్నారు. ఆక్రమణలకు పాల్పడిన వారికి నోటీసులు జారీ చేయాలని, స్పందించకపోతే కేసులు నమోదు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. వారి వెంట సీఈ కబీర్ బాషా, ఎస్‌ఈ వరప్రసాద్, ఎస్సార్బీసీ ఈఈ సురేష్ బాబు తదితరులు ఉన్నారు.

టెట్‌కు మూడు సెంటర్లు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో ఏపీ టీచర్స్ ఎలిజిబులిటీ టెస్ట్ (2024)కి మూడు సెంటర్లు ఏర్పాటు చేసినట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అక్టోబర్ 3 నుంచి 21వ తేదీ వరకు జరిగే పరీక్షలకు 8,870 మంది అభ్యర్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. అయ్యలూరు మెట్ట సమీపంలోని ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కాలేజీ, నెర్రవాడలోని శాంతిరాం ఇంజినీరింగ్ కాలేజీ, ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కాలేజీలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఆన్‌లైన్ విధానంలో జరిగే ఈ పరీక్షకు సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించరన్నారు. నామినల్ రోల్స్ లో వివరాలు మార్చుకునేందుకు తగిన ధ్రువ పత్రాలతో టెట్ పరీక్ష కేంద్రంలోని డిపార్టుమెంటల్ అధికారులను సంప్రదించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే డిప్యూటీ డీఈఓ మహబూబ్‌బేగ్ (సెల్: 9440360042), ఏఎస్‌ఓ కైసర్ అహమ్మద్ (8179855575)ను సంప్రదించాలన్నారు. డీఈఓ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు.

పకడ్బందీగా నూతన మద్యం విధానం అమలు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి

నంద్యాల(అర్బన్): జిల్లా యంత్రాంగం సహకారంతో వచ్చే నెల నుంచి చేపట్టే నూతన మద్యం విధానాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ ఉమ్మడి కర్నూలు జిల్లా డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆమె జిల్లా కలెక్టర్ రాజకుమారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన మద్యం విధానం, ప్రభుత్వం చేపట్టబోయే నవోదయం వంటి కార్యక్రమాలతో పాటు నాటుసారా, డ్రగ్స్, అక్రమ మద్యం రవాణాను అడ్డుకునేందుకు చేపట్టే చర్యలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్పందిస్తూ నవోదయం వంటి కార్యక్రమాల అమలులో పోలీసులు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల సమన్వయంతో సహకారం అందిస్తామన్నా రు. బనగానపల్లె ప్రాంతంలో నాటుసారా తయారీ ఎక్కువగా ఉందని, వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆమె వెంట కర్నూలు జిల్లా ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ హనుమంత రావు, నంద్యాల జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ పాల్గొన్నారు.

ఆనందమానందమాయె!

- 1,066 మొబైల్‌ఫోన్లు స్వాధీనం
- రూ. 2.43 కోట్ల విలువైన ఫోన్లు బాధితులకు అందజేత



రికవరీ చేసిన మొబైల్ ఫోన్‌ను బాధితురాలికి అందజేస్తున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా

బొమ్మలసత్రం: పోగొట్టుకున్న ఫోను మళ్లీ దొరికితే ఆ ఆనందం వేరు. ఆ సంతోషానికి వేదిక అయ్యింది జిల్లా పోలీసు కార్యాలయం. నంద్యాల జిల్లాలో వివిధ ప్రాంతాల్లో సెల్‌ఫోన్లను పోగొట్టుకున్న బాధితుల ఫిర్యాదు మేరకు 1,066 మొబైల్ ఫోన్లను జిల్లా పోలీసులు రికవరీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా ఆధ్వర్యంలో శుక్రవారం మొబైల్ రికవరీ మేళా నిర్వహించి బాధితులకు అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ మొబైల్ ఫోన్‌లో ప్రతి వ్యక్తి తమ వ్యక్తిగత సమాచారంతో పాటు, అన్ని రకాల లావాదేవీలకు సంబంధించిన వివరాలను భద్రంగా దాచుకోవటం జరుగతుందన్నారు. అటువంటి మొబైల్ ఫోన్ల పట్ల నిర్లక్ష్యం వహించకుండా జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. మొబైల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులు 9121101107 నంబర్‌కు హాయ్.. అని మెసేజ్ చేయాలని సూచించారు. తర్వాత మొబైల్‌కు వచ్చిన లింక్‌ను ఓపెన్ చేసి పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ సమాచారాన్ని నమోదు చేయాలన్నారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా కూడా మొబైల్ ఫోన్‌ను తిరిగి పొందవచ్చన్నారు. ఇలా ఫిర్యాదు చేసిన బాధితులకు సంబంధించి 1,066 ఫోన్‌లను ఇతర రాష్ట్రాల నుంచి తిరిగి తెప్పించటంలో సిబ్బంది కృషి అభినందనీయమన్నారు. వీటి విలువ సుమారు రూ. 2,43,10,400 ఉంటుందని అంచనా వేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు యుగంధర్‌బాబు, శ్రీనివాసులు, సీఐలు ప్రియతమ్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఇస్మాయిల్, ఆదినారాయణ, ఆర్ఐ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం మంజూరు

నంద్యాల(అర్బన్): గత నెల 30, 31 తేదీల్లో కురిసిన భారీ వర్షాలతో నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం నష్టపరిహారం మంజూరు చేసింది. జిల్లాలో దెబ్బతిన్న ఇళ్లు, మృతి చెందిన పశు సంపద బాధితులకు రూ.37 లక్షలు మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దెబ్బతిన్న ఇంటికి రూ.10 వేలు ప్రకారం 332 మంది బాధితులకు, మేక ఒక్కింటికి రూ.7,500 ప్రకారం 45 మేకల బాధితులకు, దెబ్బతిన్న పశుపాకకు రూ.5వేలు ప్రకారం మొత్తం నష్టపరిహారం రూ.37,02,500 ప్రభుత్వం మంజూరు చేసి నేరుగా బాధితుల బ్యాంక్ ఖాతాలకు జమ చేసినట్లు పేర్కొన్నారు.

అందమైన లోకం.. పుట్టుక శాపం

- పాములపాడులో గర్భిణికి సరైన వైద్యం అందక బిడ్డ మృతి
- కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రి మెట్లపైనే గిరిజన మహిళ ప్రసవం
- రెండు ఘటనల్లోనూ బయటపడిన వైద్య సిబ్బంది నిర్లక్ష్యం
- ప్రభుత్వ వైద్యం పడకేస్తున్నా అధికారుల మొద్దునిద్ర

ఆగస్టు 21..

రాత్రి 9.30 గంటలకు నెలలు నిండిన గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబీకులు పాములపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. 24 గంటలు అందుబాటులో ఉండాల్సిన డాక్టర్ లేకపోవడంతో విధుల్లో ఉన్న స్టాఫ్ నర్స్ సాజన్య ప్రసవం చేసింది. తెల్లవారుజామున శిశువు చనిపోయింది. వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతోనే తమ బిడ్డ చనిపోయిందని బాధిత మహిళ కుటుంబీకుల ఆందోళన నిర్వహిస్తే స్టాఫ్ నర్స్‌ను సస్పెండ్ చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. ఆ సమయంలో అందుబాటులో లేని డాక్టర్‌పై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

సెప్టెంబర్ 21న..

కొత్తపల్లి చెంచుగూడెం గిరిజన మహిళ ఈదమ్మ ఈ నెల 21వ కొత్తపల్లి పీహెచ్‌సీకి ప్రసవం కోసం వెళ్లింది. హెపటైటీస్ – బీ ఉండటంతో హైరిస్క్ కేసు అంటూ ఆత్మకూరుకు తీసుకెళ్లాలని సిబ్బంది చెప్పారు. ప్రసవం చేయాలని మహిళ బంధువులు ప్రాధేయపడినా వినిపించుకోలేదు. చివరకు పీహెచ్‌సీ మెట్లమీదే ఆమె ప్రసవించింది. ప్రసవం అనంతరం కూడా తల్లీ, బిడ్డలను వైద్య సిబ్బంది పట్టించుకోలేదు. అధికారుల చీవాట్లతో సిబ్బంది బాలింత, బిడ్డను తిరిగి హాస్పిటల్‌కు తీసుకొచ్చి వైద్య సేవలు అందించారు.



కొత్తపల్లి భ్రమరాంబ చెంచుగూడెంలో బాలింత ఈదమ్మను విచారణ చేస్తున్న అధికారులు

సాక్షి, నంద్యాల: పేద ప్రతిభా విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తున్న కూటమి ప్రభుత్వం అదే క్రమంలో ప్రభుత్వ వైద్య సేవలు పేదలకు అందకుండా చేస్తోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేసి పల్లె ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాల్సిన ప్రభుత్వం ప్రజల ప్రాణాలు పోతున్నా వేడుక చూస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో వైద్యులు రోజువారీ విధులకు దూరంగా ఉంటుండడంతో సీహెచ్‌సీల్లో వైద్య సేవలు అందడం లేదు. వైద్యం అందక రోగులు ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వంలో చలనం కరువైంది. నంద్యాల జిల్లాలో నెల వ్యవధిలో రెండు సంఘటనలు వైద్య సిబ్బంది నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతున్నా ప్రభుత్వ తీరు మారడం లేదు. మహానంది, బండి ఆత్మకూరు, ఆత్మకూరు, వెలుగోడు, కొత్తపల్లి, పాములపాడు, పాణ్యం, చాగలమర్రి మండలాల పరిధిలో 42 చెంచు గూడేలు ఉన్నాయి. సుమారుగా 8,400 మంది చెంచులు అక్కడ నివశిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో వైద్య సిబ్బంది ప్రతి గూడెంకు వెళ్లి వైద్య పరీక్షలు చేసేవారు. రక్త, జ్వర పరీక్షలు చేసి ఎవరైనా అనారోగ్యంతో బాధపడుతుంటే వారిని సమీపంలో హెల్త్ సెంటర్‌కు తరలించి వైద్యం అందించేవారు. ఇక గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ ఉండేది. చెంచు మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి వారికి ప్రతి నెల పరీక్షలు, పౌష్టికాహారం అందజేతతో పాటు వారి యోగక్షేమాలను తెలుసుకునే వారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారు సజావుగా ప్రసవం అయ్యేలా చర్యలు చేపట్టేవారు. కానీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గూడెలను పట్టించుకునే వారే కరువయ్యారు. స్థానిక ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు మొక్కుబడిగా చెంచు గూడెలను సందర్శిస్తున్నారని చెంచులు చెబుతున్నారు. ఇటీవల పాములపాడు, కొత్తపల్లి పీహెచ్‌సీ పరిధిలో జరిగిన ఘటనలు వైద్య సిబ్బంది నిర్లక్ష్యాన్ని చూపుతున్నాయి.

సమ్మెలో వైద్యులు..

నెల వ్యవధిలో రెండు ఘటనలు జరిగినా జిల్లా అధికారులు మొద్దు నిద్ర వీడలేదు. పీజీ వైద్య విద్యలో గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోని పీహెచ్‌సీల్లో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌లుగా సేవలందించే ఎంబీబీఎస్ వైద్యులకు ఇన్‌సర్వీస్ రిజర్వేషన్ కోటా కూటమి ప్రభుత్వం కుదించింది. దీంతో రెండు వారాల నుంచి సీహెచ్‌లలో విధులు నిర్వహించే డాక్టర్లు సమ్మెబాట పట్టారు. కొందరు డాక్టర్లు సమ్మె పేరుతో అసలు విధులకే హాజరవడం లేదు. మరికొందరు సెలవు పెట్టేసి వెళ్లిపోయారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన ప్రభుత్వం ఘోరంగా విఫలమవడంతో మెరుగైన వైద్య సేవలందక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అధికారుల విచారణ

కొత్తపల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది నిర్లక్ష్యంతో ఆసుపత్రి మెట్లపై చెంచు మహిళ ప్రసవించిన ఘటనపై శుక్రవారం జిల్లా వైద్యశాఖ నుంచి ఎన్‌సీడీఆర్‌బీఎస్‌కే ఇన్‌చార్జ్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కాంతారావు నాయక్ విచారణ చేపట్టారు. ముందుగా ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం చెంచుగూడెం చేరుకొని ఈదమ్మ, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాన్పు అయిన రోజు జరిగిన ఘటనను బాధితురాలిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాంతారావు నాయక్ మాట్లాడుతూ పూర్తి స్థాయి నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. విచారణలో డీఎంహెచ్‌ఓ కార్యాలయం డాక్టర్లు శ్రీజ, అష్రఫ్, కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు దీపా నాగవేణి, మహమ్మద్ బేగ్, సిబ్బంది ఉన్నారు.

జిల్లాలో పీహెచ్‌సీలు	52
అర్బన్ హెల్త్ సెంటర్లు	16
సీహెచ్‌సీలు	11
ఏరియా హాస్పిటల్స్	2
ప్రభుత్వ జనరల్ హాస్పిటల్	1
చెంచు గూడెంలు	42
గూడెంలో జనాభా సుమారుగా	8,400

దేవుడే నన్ను, బిడ్డను కాపాడాడు



ఈ నెల 21వ తేదీ ఉదయం 10 గంటలకు పురిటి నొప్పులతో కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రికి వెళ్లాం. నొప్పులు వస్తున్నాయని డెలివరీ చేయాలని మా బంధువులు, నేను వేడుకున్నాం. కానీ, వైద్య సిబ్బంది ఇక్కడ డాక్టర్లు సమ్మెలో ఉన్నారు.. మీరు ఆత్మకూరుకు వెళ్లండని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. ప్రాధేయపడినా వినిపించుకోలేదు. నొప్పులు ఎక్కువకావడంతో ఆటోలో వేరే ఆస్పత్రికి వెళ్దామని బయటికి వచ్చాం. బయటికి రాగానే ఆరు బయటే ప్రసవమైంది. దేవుడి దయ వల్ల నేను, నా బిడ్డ క్షేమంగా బతికిపోయాం.

– రాయ ఈదమ్మ, భ్రమరాంబ గిరిజనగూడెం, కొత్తపల్లి మండలం

క్లుప్తంగా

పీఆర్ ఎస్‌ఈగా రామచంద్రారెడ్డి బాధ్యతల స్వీకరణ



ఎస్‌ఈకి అభినందనలు తెలుపుతున్న ఇంజనీర్లు, ఉద్యోగులు

కర్నూలు(అర్బన్): పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజనీరుగా వి.రామచంద్రారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ఆయన జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్యను మర్యాద పూర్వకంగా కలిశారు. వైఎస్సార్ కడప జిల్లాలో ఈఈగా విధులు నిర్వహిస్తున్న రామచంద్రారెడ్డికి ప్రభుత్వం ఎస్‌ఈగా పదోన్నతి కల్పించి ఇక్కడకు బదిలీ చేసింది. 1989లో అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రంలో ఏఈఈగా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించిన రామచంద్రారెడ్డి 1998లో డీఈఈగా, 2018లో ఈఈగా పదోన్నతి పొంది నేడు ఎస్‌ఈగా బాధ్యతలు చేపట్టారు.

యువకుడి ఆత్మహత్య



మృతుడు షఫీబాషా (ఫైల్)

దేవనకొండ: మండలంలోని పి.కోటకొండ గ్రామంలో ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు.వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన జరీనాబీకి ఇద్దరు కుమారులు. వీరిలో మొదటి కుమారుడు రెండేళ్ల క్రితం చనిపోయాడు. రెండో కుమారుడైన షఫీబాషా (22)ఇంటర్ వరకు చదువుకుని ప్రైవేట్ వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఏమైందో ఏమో తెలియదు కానీ శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తర్వాత ఇంటికి వచ్చిన తల్లి గమనించి చూడగా అప్పటికే చనిపోయి ఉన్నాడు. చేదోడుగా ఉన్న రెండో కుమారుడు కూడా మృతిచెందడంతో ఆమె శోకసంద్రంలో మునిగిపోయారు. కాగా యువకుడి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం



వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి సమీపంలోని 44వ జాతీయ రహదారిలో ఉన్న ప్రైవేట్ గ్రానైట్ పరిశ్రమ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందాడు. దాదాపు 55 ఏళ్ల ఉన్న అతనికి రోడ్డుపై గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లిపోయింది. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం డోన్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతిచెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అశోక్ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వార సమాచారం ఇవ్వాలని కోరారు.

భైరవా కరవకు!

- జిల్లాలో ఏటా 5వేల మందికి పైగా కుక్కకాటు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా మందు
- అప్రమత్తతే అవసరం అంటున్న వైద్యులు
- నేడు రేబిస్ వ్యాధి నివారణ దినం

కర్నూలు(హాస్పిటల్)/అగ్రికల్చర్: విశ్వాసంలో కుక్కకు మించిన ప్రాణి మరొకటి లేదంటారు. అందుకే కొందరు వాటిని ఇంటికి రక్షణగా, మరికొందరు తోడుగా ఉంటుందని భావించి పెంచుకుంటారు. వీటితో పాటు వీధి కుక్కలు సమాజంలో జీవిస్తూ ఉంటాయి. ఇవి దొరికిన ఆహారాన్ని తింటూ బ్రతుకునీడుస్తుంటాయి. అయితే, కొన్నిసార్లు అవి తమకు ప్రమాదం తెస్తున్నారని భావించి కరుస్తూ ఉంటాయి. ఈ కాటు ఒక్కోసారి ప్రాణాపాయంగా మారే అవకాశం ఉంది. దీనినే రేబిస్ వ్యాధి అంటారు. లూయిస్ ప్యాశ్చర్ అనే శాస్త్రవేత్త ఈ వ్యాధికి వ్యాక్సిన్ కనుగొన్నారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకుని, ఈ వ్యాధిపై అవగాహన కల్పించేందుకుగాను ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 28వ తేదీన రేబిస్ వ్యాధి నివారణ దినంగా నిర్వహిస్తున్నారు.

రేబిస్ వ్యాధి ప్రాణాంతకం

రేబిస్ జంతువుల నుంచి మనుషులకు రాబ్డో అనే వైరస్ ద్వారా వ్యాపించే ప్రమాదకరమైన వ్యాధి. ముఖ్యంగా కుక్కలు, కోతులు వంటి పెంపుడు జంతువులు రేబిస్ వ్యాధి కారణంగా మనుషులను కరవడం లేదా గీకడం ద్వారా ఈ వ్యాధి వ్యాపిస్తుంది. కరిచిన నాలుగు ఐదు రోజుల తర్వాత వ్యాధి బయట పడుతుంది. అయితే కుక్క ఎక్కడ కరిచింది, ఎంతో లోతుగా గాయమైంది, ఏ ప్రాంతంలో కరిచింది, బట్టలపై కరిచిందా, నేరుగా కరిచినప్పుడు ఎంత మేరకు వైరస్ శరీరంలోకి ప్రవేశించిందన్న దానిపై వ్యాధి తీవ్రత ఆధారపడి ఉంటుంది. కుక్కకాటు తర్వాత వైరస్ శరీరంలోని కండరాల్లోకి వెళ్లి అక్కడ అభివృద్ధి చెంది నరాల్లోకి ప్రవేశిస్తుంది. ఆ తర్వాత నరాల్లో నుంచి మెదడులోకి వెళ్తుంది. అక్కడ నుంచి కణాల సముదాయంలోకి, కండరాల్లోకి, ఎముకలు, గ్రంథుల్లోకి వెళ్లి లాలాజలంలో ప్రవేశిస్తుంది. స్కిన్ బయాప్సీ, లాలాజలం ద్వారా ఈ వైరస్‌ను నిర్ధారిస్తారు.

అరకొరగా ఏఆర్‌వీ ఇంజెక్షన్లు

జిల్లాలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు ఎమ్మిగనూరు, ఆదోని ఏరియా ఆసుపత్రులు, ఐదు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 35 పీహెచ్‌సీలు, 12 కొత్త పీహెచ్‌సీలు, 28 అర్బన్ హెల్త్ సెంటర్లు, 426 సచివాలయాలు ఉన్నాయి. సచివాలయాలు మినహా ప్రతి ఆరోగ్య కేంద్రంలో కుక్కకాటుకు ఏఆర్‌వీ ఇంజెక్షన్ వేస్తున్నారు. ఈ మేరకు ప్రతి పీహెచ్‌సీలో జనాభాను బట్టి 50 నుంచి 80 దాకా సీహెచ్‌సీలో 200 దాకా, ఏరియా ఆసుపత్రుల్లో 500 దాకా, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వెయ్యి దాకా ఏఆర్‌వీ ఇంజెక్షన్లు అందుబాటులో నిత్యం ఉంచాల్సి ఉంది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండో క్వార్టర్ మందులు ఇంకా రాలేదు. ఫలితంగా పలు ఆసుపత్రుల్లో కుక్కకాటు మందులకూ కొరత



ఏర్పడింది. వాటి నిల్వలు సగానికి పైగా పడిపోయాయి. ప్రస్తుతం కర్నూలులోని సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లో 3,461 ఏఆర్‌వీ వాయిల్స్ అందుబాటులో ఉన్నాయి. జిల్లాలో ఎక్కువగా కుక్కకాటు బాధితులు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వస్తున్నారు. ప్రతి నెలా 500కు పైగా కొత్త కేసులు, వెయ్యికి పైగా పాత కేసులకు ఏఆర్‌వీ ఇంజెక్షన్లు వేయాల్సి ఉంటుంది.

కుక్కకాటు కేసులు ఇలా

సంవత్సరం	బాధితులు
2021	3,533
2022	5,333
2023	5,299
2024	7,028

వ్యాధి నిర్ధారణ

కుక్కకాటు తర్వాత పదిరోజుల పాటు ఎలాంటి లక్షణాలు కనిపించకపోతే ఆందోళన చెందాల్సిన పనిలేదు. కరిచిన పదిరోజుల్లోగా కుక్క చనిపోతే దానికి వైరస్ ఉందని భావించాలి. ఇలాంటి కుక్కలు మనిషికి ఉన్న పుండ్లు, గాయం ఉన్న చోట నాకినా, కొరికినా రేబిస్ వచ్చే ప్రమాదం ఎక్కువ.

లక్షణాలు ఇలా..

తలనొప్పి,ఒళ్లునొప్పులు,గొంతునొప్పి,సాధారణ జ్వరం ఉంటాయి. దీంతో పాటు కుక్క కరిచిన ప్రాంతంలో నొప్పి పెరుగుతుంది.ఈ లక్షణాల తర్వాత వైరస్ మెదడును తీవ్రమైన ఉద్వేగాలకు లోనయ్యేలా చేస్తుంది. దీంతో గాలికి భయపడతారు.దీనిని ఏరో ఫోబియో అంటారు. నీళ్లను చూసిన వణికిపోతారు.ఈ కండిషన్ నుహైడ్రోఫోబియాఅంటారు.గొంతులోని కండరాలు బిగుసుకుపోతాయి.ఈ పరిస్థితుల్లో రోగినిఆసుపత్రిలో చేర్చాలి. క్షణాలను బట్టి వైద్యులు చికిత్స అందిస్తారు.



నేడు పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు

ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నేడు పశుసంవర్ధకశాఖ పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని చేపట్టింది. కర్నూలులోని బహుళార్థ పశువైద్యశాలతో పాటు వెటర్నరీ ఆసుపత్రుల్లో ఈ వ్యాక్సిన్ వేయనున్నట్లు ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. అలాగే మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి సర్కిల్‌లోని దామోదరం సంజీవయ్య స్మారక ఉన్నత పాఠశాలలో రేబిస్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కుక్కకరిస్తే ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- కుక్కకాటుకు గురైన వారు తప్పనిసరిగా యాంటి రేబిస్ వ్యాక్సిన్(ఏఆర్‌వీ) వేయించుకోవాలి.
- వీరికి మొదటి, మూడవ, ఏడవ, 14వ, 30వ రోజుల్లో వ్యాక్సిన్ వేస్తారు. కుక్క కాటుకు గురైందన్న అనుమానం ఉన్న వారికి మొదటి, మూడో రోజున వ్యాక్సిన్ వేస్తారు.
- కుక్కే కాదు పంది, పందికొక్కులు, కోతులు, గాడిదలు, గుర్రాలు, గబ్బిలాలు, ఎలుకలు, పిల్లులు వంటి జంతువులు కరిచినా ఏఆర్‌వీ వ్యాక్సిన్ వేయించుకోవాలి.
- కుక్క కరిచిన వెంటనే గాయాన్ని శుభ్రంగా కడగాలి. అనంతరం వైద్యుని వద్దకు వచ్చి చికిత్స తీసుకోవాలి. అతి పెద్ద గాయాలైతేనే కట్టుకట్టాలి. చిన్న గాయాలను కట్టుకట్టకుండా వదిలేయాలి.

జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు



కుక్క కాటుకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏఆర్‌వీ వ్యాక్సిన్ అందుబాటులో ఉన్నాయి. ప్రజలు సైతం కుక్కకాటు పట్ల నిర్లక్ష్యంగా ఉండకుండా అవి కరిచిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి ఉచితంగా వ్యాక్సిన్ వేయించుకోవాలి. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు రేబిస్ మరణాలు సంభవించలేదు. ఈ వ్యాధిపై అవగాహన పెంపొందించేందుకు జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము.

–డాక్టర్ ఎల్. భాస్కర్, డీఎంహెచ్‌వో, కర్నూలు

పిల్లలను ఒంటరిగా బయటకు వదలొద్దు



చిన్నపిల్లలను ఎప్పుడూ ఒంటరిగా బయటకు పంపించొద్దు. పిల్లలు ఒంటరిగా కనిపిస్తే కుక్కలు దాడి చేసే ప్రమాదం ఉంది. కాబట్టి పిల్లలతో పాటు పెద్దలు కూడా వెంట ఉండాలి. కుక్క కరిచిన వెంటనే నాటు మందుకు వెళ్లకుండా గాయాన్ని శుభ్రంగా కడిగి ఏఆర్‌వీ ఇంజెక్షన్ వేయించుకోవాలి. కరిచిన కుక్కను గమనిస్తూ ఉండాలి. వారం, పదిరోజుల్లో అది జొల్లు కారుస్తూ చనిపోతే దానికి దానికి రేబిస్ ఉందని భావించి ఇమ్యునోగ్లోబ్లిన్ ఇంజెక్షన్ వేయించుకోవాలి.

–డాక్టర్ రవికళాధర్‌రెడ్డి, జనరల్ ఫిజీషియన్, కర్నూలు

మద్యం దుకాణాల్లో కొరత రానివ్వొద్దు



డిప్యూటీ కమిషనర్ పోతుల శ్రీదేవి

కర్నూలు: నూతన మద్యం పాలసీ అమలులోకి వచ్చే వరకు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో కొరత లేకుండా చూడాలని ఎక్సైజ్ అధికారులకు ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ పోతుల శ్రీదేవి సూచించారు. ఉమ్మడి జిల్లాలోని 14 ఎక్సైజ్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలతో పాటు సూపరింటెండెంట్లు సుధీర్ బాబు, రవికుమార్‌లతో శుక్రవారం ఆమె టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. మద్యం విక్రయాల సొమ్ము పక్కదారి పట్టకుండా లావాదేవీలను తనిఖీ చేయాలన్నారు. ఏరోజుకారోజు సేల్స్‌కు సంబంధించిన లెక్కలు సరిచూసి సంబంధిత సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్ల సమన్వయంతో సొమ్మును బ్యాంకుల్లో జమ చేయించాలన్నారు. అంతకుముందు ఆ శాఖ రాష్ట్ర కమిషనర్ నిశాంత్‌కుమార్ అన్ని జిల్లాల ఎక్సైజ్ అధికారులతో నూతన మద్యం పాలసీపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థి బాలాజీ

కోసిగి: కోసిగి బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఆర్ బాలాజీ అనే విద్యార్థి జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఖలీల్ అహ్మద్ తెలిపారు. ఈనెల 15వ తేదీన ప్రకాశం జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో తమ విద్యార్థి పాల్గొని ఉత్తమ ప్రతిభ కనపరిచినట్లు తెలిపారు. ఈ నెల 27 నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు ఝార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీ పట్టణంలో జరిగే జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. అనంతరం ఆ విద్యార్థిని హెచ్‌ఎంతో పాటు పీఈటీ శ్రీరాములు, సీనియర్ ఖోఖో క్రీడాకారులు బాలకృష్ణ, ఈరన్న ప్రత్యేకంగా అభినందించారు.

మరింత తగ్గిన ఉల్లి ధర

- క్వింటా గరిష్ట ధర రూ.4,009



కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు మార్కెట్‌లో ఉల్లి ధరలు తగ్గుతుండటం పట్ల రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. శుక్రవారం మార్కెట్‌కు 158 మంది రైతులు 4,366 క్వింటాళ్ల ఉల్లి తీసుకొచ్చారు. ఈ నెల 26న క్వింటాకు గరిష్టంగా రూ.4,143 ధర లభించింది. తాజాగా గరిష్టంగా రూ.4,009 ధర పలికింది. అంటే క్వింటాపై రూ.134 తగ్గింది.

- కొర్రలు, సజ్జలు, ఆముదం తదితర పంటల ధరలు నిరాశజనకంగా ఉన్నాయి. కొర్రలు మార్కెట్‌కు 343 క్వింటాళ్లు వచ్చాయి. కనిష్టంగా రూ.2,029, గరిష్టంగా రూ. 2,875 లభించగా.. సగటు ధర రూ.2,499 నమోదైంది.
- సజ్జలు మార్కెట్‌కు 211 క్వింటాళ్లు రాగా కనిష్టంగా రూ.1,970, గరిష్టంగా రూ.2,111 లభించగా.. సగటు ధర రూ.2065 నమోదైంది.
- కందుల ధర జోరుమీద ఉంది. మార్కెట్‌కు కందులు 113 క్వింటాళ్లు రాగా కనిష్టంగా రూ.8,330, గరిష్టంగా రూ.10,282 లభించగా.. సగటు ధర రూ.10,222 నమోదైంది.
- వేరుశనగ 638 క్వింటాళ్లు రాగా కనిష్టంగా రూ.1,569, గరిష్టంగా రూ.7,010, సగటు ధర రూ.5066 నమోదైంది.
- ఆముదం మార్కెట్‌కు 594 క్వింటాళ్లు వచ్చాయి. కనిష్టంగా రూ.5,390,కనిష్టంగా రూ.5,981 పలికింది.

సరదాగా చేపలవేటకు వెళ్లి..

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని బెలుంశింగవరం సమీపంలో గాలేరు నగరి సుజల స్రవంతి (జీఎన్‌ఎస్‌ఎస్) వరద కాలువలో పడి శుక్రవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే...కోవెలకుంట్ల మండలం వెలగటూరు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ బైరేణి నాగన్న (48) అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులతో కలిసి సరదాగా చేపల వేటకు జీఎన్‌ఎస్‌ఎస్ కాలువ వద్దకు వెళ్లాడు. అక్కడ అదుపు తప్పి కాలువ నీటిలో పడిపోయాడు. వెంట ఉన్న వ్యక్తులు గమనించి నీటిలో దూకి బయటకు తీసుకొచ్చారు. తర్వాత చికిత్స నిమిత్తం కోవెలకుంట్ల సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ ఘటనపై కొలిమిగుండ్ల పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించండి

- జిల్లా ఉద్యాన అధికారి రామాంజనేయులు




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన అధికారి పి.రామాంజనేయులు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలని, ఈ పంట సాగుకు ఉన్న అవకాశాలపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా ఉద్యాన అధికారి పి.రామాంజనేయులు ఆదేశించారు. శుక్రవారం ఆయ న తన కార్యాలయంలో జిల్లాలోని ఉద్యాన అధికారులతో ఉద్యాన పథకాల అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్, ఆర్‌కేవీవై, ఆయిల్‌పామ్ సాగు తదితర వాటిపై సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మండలంలో రాబోయే మూడు నెలల్లో ఉద్యానశాఖ చేపట్టే కార్యక్రమాలపై కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. ఎంఐడీహెచ్, ఆర్‌కేవీవై కింద వివిధ కాంపోనెంటు కింద ఇచ్చిన లక్ష్యాలను సాధించడంపై దృష్టి సారించాలని తెలిపారు. ఇప్పటి వరకు ఈ ఏడాది 250 హెక్టార్లలో ఉద్యాన పంటల విస్తరణ చేపట్టామని, 70 హెక్టార్లలో పాత తోటల పునరుద్ధరణ జరిగినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 10 హెక్టార్లలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటడం పూర్తి అయిందని, వచ్చే మూడు నెలల్లో కనీసం 20 హెక్టార్లలో సాగు చేపట్టే విధంగా చూడాలన్నారు. సమావేశంలో ఉద్యాన సాంకేతిక అధికారి అనూష, ఉద్యాన అధికారులు నరేష్, ఇందిర, అపర్ణ, శ్రీవాణి, మదన్‌మోహన్‌గౌడు, దస్తగిరి పాల్గొన్నారు.

రెచ్చిపోయిన ఎన్టీఆర్ అభిమానులు

- తమిళనాడు బస్సు, క్యూఆర్‌టీ వాహనంపై రాళ్లతో దాడి

కర్నూలు : జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు కర్నూలులో రెచ్చిపోయారు. దేవర సినిమా విడుదల సందర్భంగా గురువారం అర్ధరాత్రి శ్రీరామ థియేటర్ వద్దకు అభిమానులు పెద్ద ఎత్తున చేరుకొని సందడి చేస్తున్నారు. అందులో మద్యం సేవించిన కొందరు అటువైపు వస్తున్న తమిళనాడుకు చెందిన ప్రైవేటు బస్సుపై రాళ్లు రువ్వడంతో అద్దాలు పగిలిపోయాయి. బస్సులోని ప్రయాణికులు గట్టిగా కేకలు వేయడంతో సమీపంలోనే ఉన్న క్యూఆర్‌టీ పోలీసులు అక్కడికి చేరుకోగా గుంపులో ఉన్న కొంతమంది అభిమానులు రెచ్చిపోయి క్యూఆర్టీ వాహనంపై కూడా రాళ్లు రువ్వి రోడ్డుకు అడ్డంగా నిలబడి వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగించారు. దీంతో విధుల్లో ఉన్న సిబ్బంది ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



టోపీ ఆకారంలో బండరాయి




పడవను రాయికి ఆనిచ్చినట్లుగా..


రాళ్లు..అపు‘రూపాలు’

చుట్టూ పచ్చని పంట పొలాలు..మధ్యలో ఎత్తైన కొండ..అందులో ఎవరో పేర్చినట్టు కనిపించే బండరాళ్లు..చూడగానే కనువిందు చేసే ఈ ప్రకృతి అందాలు ఆస్పరి మండలం కలపరి గ్రామ సమీపంలోని గంగమ్మవ్వ దొన కొండల్లో దర్శనమిస్తున్నాయి. ప్రకృతి చెక్కిన శిల్పాల్లా ఒక్కో బండరాయి ఒక్కో రూపాన్ని ఆవిష్కరింపజేస్తోంది. ఈ మార్గంలో ప్రయాణించే వారు, గంగమ్మవ్వను దర్శించుకోవడానికి వచ్చిన భక్తులు వాటిని ఆసక్తిగా చూస్తూ ఆశ్చర్యపోతున్నారు.


–ఆస్పరి




పంట పొలాల మధ్య గంగమ్మవ్వ దొనకొండ



తాబేలు రూపంలో...



కుర్చీపై దిండ్లు పెట్టినట్లుగా..



శివలింగాకారంలో..